

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | గురువారం 01 అక్టోబర్ 2026 | సంపుటి : 01, సంచిక : 11 | పేజీలు : 04, వెల రూ.2

క్వాంటమ్ నుంచి ఉద్యోగాల వరకు.. ఏపీ భవిష్యత్‌పై లోకేశ్ కీలక వ్యాఖ్యలు



20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమన్న మంత్రి లోకేశ్

యువత మార్పు కోరుకుంటోందన్న మంత్రి

డీఎస్సీపై ఆరోపణలను కొట్టివేసిన లోకేశ్

అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు ప్రస్తావన

పెట్టుబడులకు 3ఎస్ విధానం అనుసరిస్తున్నామని వివరణ

అమరావతి: యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్2026లో సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. మిగతా..2లో

ఆసియా క్రీడల్లో స్వర్ణం.. చికిత, సాహిల్‌కు సీఎం రేవంత్ అభినందనలు



ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన చికిత, సాహిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.

ఆసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి చికిత స్వర్ణ పతకాన్ని సాధించింది.

హైదరాబాద్, సెప్టెంబర్ 30: ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన చికిత, సాహిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఆసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి చికిత స్వర్ణ పతకాన్ని సాధించింది. మిక్స్‌డ్ కాంపౌండ్ ఆర్చరీలో చికిత-సాహిల్ జోడీకి గోల్డ్ వరించింది. దీంతో ఒకేరోజు రెండు స్వర్ణాలు సాధించిన చికిత.. 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఈ క్రమంలో ఆసియా క్రీడల్లో సర్ణం సాధించిన పెద్దపల్లికి మిగతా..2లో

కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చంద్రకళ పతకం గెలవడం అభినందనీయం



- కామన్వెల్త్ పోటీల్లో సత్తా చాటిన ఎక్సైజ్ కానిస్టేబుల్ చంద్రకళ
- చంద్రకళను అభినందించిన ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- పథకాలు సాధించే క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యాఖ్య

అమరావతి: అంతర్జాతీయ క్రీడా వేదికలపై ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు తమ సత్తా చాటారు. కెనడాలో జరిగిన కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన రాష్ట్ర ఎక్సైజ్ కానిస్టేబుల్ చంద్రకళను గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం సత్కరించారు.

పేదల సంతోషమే నిజమైన అభివృద్ధి..

60 వేల మందికి పట్టాలు ఇచ్చాం

- 'నేడు ఇంతమంది ముఖాల్లో నవ్వులు చూస్తున్నా.
- నా జీవితంలో ఈరోజును తప్పకుండా గుర్తు పెట్టుకుంటా' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.
- విజయవాడలో నిర్వహించిన పేదల పట్టాల పండుగ సభలో సీఎం మాట్లాడారు.



విజయవాడ, సెప్టెంబర్ 30: 'నేడు ఇంతమంది ముఖాల్లో నవ్వులు చూస్తున్నా. నా జీవితంలో ఈరోజును తప్పకుండా గుర్తు పెట్టుకుంటా' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. పేదల పట్టాల పండుగ సభలో సీఎం మాట్లాడుతూ.. ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని తెలిపారు. మిత్రులు పవన్ కల్యాణ్, మోదీతో కలిసి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. నేడు అభివృద్ధి, సంక్షేమంలో జెట్ స్పీడుతో ముందుకు సాగుతున్నామన్నారు. విశాఖ, మంగళగిరి, నేడు విజయవాడలో ఇన్ని వేల మందికి పట్టాలు ఇవ్వడం జీవితంలో మరచిపోనని అన్నారు. అరవై వేల మందికి పట్టాలు ఇచ్చామన్నారు. రిజిస్ట్రేషన్ విలువ రూ.19 వేల కోట్లు కాగా.. మిగతా..2లో

రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా ప్రకటిస్తాం..

రూ.లక్ష కోట్లతో అభివృద్ధి



- రైజింగ్ రాయలసీమ కోసం రాయలసీమ బిడ్డగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు పోరాడుతున్నారని మంత్రి సవిత తెలిపారు.
- రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు సంఘీభావంగా పులివెందులలో టీడీపీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు.

కడప, సెప్టెంబర్ 30: 'రైజింగ్ రాయలసీమ' కోసం రాయలసీమ బిడ్డగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు పోరాడుతున్నారని మంత్రి సవిత తెలిపారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు సంఘీభావంగా పులివెందులలో టీడీపీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మిగతా..2లో

సహ పైలట్‌తో పోరాడి.. 180 మంది ప్రాణాలు కాపాడిన భారతీయ పైలట్



- సహ పైలట్ దాడి చేసినా.. ప్రాణాలకు తెగించి మరీ ఆయన 180 మంది ప్రాణాలు కాపాడారు.
- ఓవైపు దాడిని ఎదుర్కొంటూనే.. మరోవైపు విమానం కూలిపోకుండా నియంత్రించారు.

ఇంటర్నెట్ డెస్క్: దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఉగ్రవాద ప్రయత్నాన్ని అదే విమానానికి కెప్టెన్‌గా ఉన్న ఓ భారతీయుడు అడ్డుకున్నారు.

పునరుత్పాదక ఇంధన రంగానికి ఊతం..

రూ.1,86,405 కోట్ల నిధులు

- దేశంలో పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.
- ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ 'పీఎం ధార'పథకానికి ఆమోదం తెలిపింది.



ఢిల్లీ, సెప్టెంబర్ 30: దేశంలో పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఇవాళ ఢిల్లీలో సమావేశమైన కేంద్ర క్యాబినెట్ 'పీఎం ధార'పథకానికి ఆమోదం తెలిపింది. ఈ భారీ ప్రాజెక్టు కోసం రూ.1,86,405 కోట్ల నిధులు కేటాయించారు. సోలార్ లేదా విండ్ ప్లాంట్లు సాధారణంగా నగరాలకు దూరంగా (ఎడారులు లేదా మైదాన ప్రాంతాల్లో) ఉంటాయి. అక్కడ తయారైన కరెంట్‌ని అక్కడే ఉంచలేం. దాన్ని మన ఇళ్లకు, పరిశ్రమలకు చేర్చాలంటే భారీ ట్రాన్స్‌మిషన్ లైన్లు (విద్యుత్ తీగలు), సబ్-స్టేషన్లు, గ్రిడ్ వ్యవస్థ కావాలి. అక్కడ ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌లోకి సురక్షితంగా తరలించడాన్ని మిగతా..2లో

అక్టోబర్2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' యాత్ర

ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసిన ఇండీ కూటమి



- అక్టోబర్ 6న ఈసీ కార్యాలయం వరకు విపక్ష ఎంపీల ప్రదర్శన
- విపక్ష ఎంపీలు ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపిన మల్లికార్జున ఖర్గే

ఢిల్లీ : ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసిన కూటమి ఓటరు జాబితా సవరణ లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలకు ఇండియా కూటమి సిద్ధమైంది. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసింది. యువత, ఎన్జీవోలను కలుపుకుని అక్టోబర్ 2 నుంచి 8 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలు చేపట్టనున్నారు. అలాగే జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయనున్నారు. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలంతా ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీగా చేపట్టనున్నారు. అక్టోబర్ రెండో వారంలో ప్రతిపక్ష నేతలంతా రాష్ట్రపతిని కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినతిపత్రం సమర్పించనున్నారు. దేశవ్యాప్తంగా 5 భారీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. వాటి తేదీలు, ప్రదేశాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. గతంలో నోట్ బందీ చేసిన ప్రధాని మోదీ, ఇప్పుడు 'ఓట్ బందీ' ద్వారా ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రధాని, హోంమంత్రి మిగతా..2లో

కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ...



- జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలన్న మల్లు భట్టి
- కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలని పిలుపు
- సీఎం రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ
- నేతలను కులం కోణంలో చూడకూడదని వ్యాఖ్య
- గ్యారెంటీ పథకాలు ఉచితాలు కావన్న డిప్యూటీ సీఎం

హైదరాబాద్: వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ

మంచిపేరొచ్చినా.. చెడ్డ పేరొచ్చినా

ఉద్యోగుల వల్లే

సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



- ప్రభుత్వానికి మంచి పేరొచ్చినా, చెడ్డ పేరొచ్చినా అది పూర్తిగా ఉద్యోగుల పనితీరు వల్లే ఉంటుందని సీఎం స్పష్టం
- కరీంనగర్‌లో నూతనంగా నిర్మించిన కలెక్టర్ భవనాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు.
- ప్రభుత్వ ఉద్యోగులే కీలక ప్రతినిధులని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.
- రాష్ట్రంలో 10.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 4 కోట్ల మంది ప్రజలకు సేవలు అందిస్తున్నారని

హైదరాబాద్: పేదల సమస్యల పరిష్కార వేదికలుగా కలెక్టరేట్ కార్యాలయాలు సక్రమంగా ఉపయోగపడాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కరీంనగర్‌లో నూతనంగా నిర్మించిన కలెక్టర్ భవనాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఆయనతో పాటు కేంద్ర మంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు. అనంతరం అక్కడే కలెక్టరేట్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ప్రభుత్వ పాలన, ఉద్యోగుల బాధ్యతలు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై సీఎం పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

ఉద్యోగులే ప్రభుత్వ ప్రతినిధులు..

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వ ఉద్యోగులే కీలక ప్రతినిధులని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు లేదా మిగతా..2లో

గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం'..

వీబీ జీ రామ్ జీ అమలుపై మంత్రి సీతక్క సమీక్ష



- వీబీ జీ రామ్ జీపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
- గామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్ష చేపట్టారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 30: వీబీ జీ రామ్ జీపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్ష చేపట్టారు. గ్రామాల్లో పనుల గుర్తింపు, ఉపాధి కల్పన, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి క్షేత్రస్థాయి సమస్యలపై మంత్రి ఆరా తీశారు. అమలులో గ్రామ పంచాయతీల పాత్ర, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు.

మొదటి పేజీ తరువాయి

రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా ప్రకటిస్తాం.. రూ.లక్ష కోట్లతో అభివృద్ధి

అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా సీఎం ప్రకటిస్తారని చెప్పారు. హార్టికల్చర్ హబ్ కోసం లక్ష కోట్లు ఖర్చు చేస్తామన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.26 వేల కోట్లు కేటాయిస్తామని వెల్లడించారు. ప్రతి ఎకరాకు నీరు అందించడంతో పాటు వేర్ హౌజ్, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాలు చేపడతామని మంత్రి తెలిపారు. పులివెందులకు కూడా వైఎస్ జగన్ సాగు నీరు ఇవ్వలేకపోయారని విమర్శించారు. పులివెందులలో రూ.480 కోట్లతో తాగు నీరు అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజలు టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించారని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పులివెందుల మున్సిపాలిటీలో ప్రజలు టీడీపీని గెలిపించాలని కోరారు. పులివెందుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబడి ఉన్నారని మంత్రి సవిత స్పష్టం చేశారు.

కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చంద్రకళ పతకం గెలవడం అభినందనీయం

మరోవైపు, ఏషియన్ గేమ్స్‌లో ఏపీకి చెందిన స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, క్రీడాకారుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ప్ఉందని స్పష్టం చేశారు. ఒలింపిక్స్‌లో ఏపీ అథ్లెట్లు పతకాలు సాధించేలా వారికి అన్ని విధాలా మద్దతు అందిస్తున్నామని తెలిపారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ అండగా నిలుస్తున్నామని, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కామన్వెల్త్ 75 కేజీల విభాగంలో చంద్రకళ రజతం గెలవడం అభినందనీయమని రఆయన కొనియాడారు. ఇదే సమయంలో, జపాన్‌లో జరుగుతున్న ఏషియన్ గేమ్స్ 2026లో భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఫైనల్లో చైనాపై 238-234 స్కోరు తేడాతో విజయం సాధించింది. ఈ జట్టులో ఏపీకి చెందిన వెన్నం జ్యోతి సురేఖ కీలక పాత్ర పోషించారు. ఆమెతో పాటు చికిత తనపర్తి, ప్రతిక ప్రదీప్ సభ్యులుగా ఉన్నారు. జ్యోతి సురేఖకు ఇది ఏషియన్ గేమ్స్‌లో నాలుగో స్వర్ణం కావడం విశేషం. ఈ విజయాలు రాష్ట్రానికి, దేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయి.

గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం'.. వీబీ జీ రామ్ జీ అమలుపై మంత్రి సీతక్క సమీక్ష

అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. పనుల ఎంపికలో గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఉపాధి పనుల్లో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనానికి పెద్దపీట అని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా మండల, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి, గ్రామాలకు అభివృద్ధి, అమలును మరింత పటిష్ఠం చేయాలని మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో 12 వేల మందికిపైగా సర్పంచులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆసియా క్రీడల్లో స్వర్ణం.. చికిత, సాహిల్‌కు సీఎం రేవంత్ అభినందనలు

చెందిన చికిత ప్రతిభపై ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. చికిత విజయం తెలంగాణ క్రీడా చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. చికిత పట్టుదల క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. ఆసియా క్రీడలు 2026లో కాంపౌండ్ ఆర్చరీలో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో చికిత, సాహిద్ జోడి స్వర్ణపతకాన్ని కైవసం చేసుకుంది. (బుధవారం) జరిగిన ఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన పార్క్ జంగ్యూన్, చోయ్ యోంగ్‌హీ జోడీని షూట్‌ఆఫ్‌లో ఓడించి చికిత, సాహిల్ జోడి స్వర్ణం సాధించింది. ఫైనల్‌లో 157-157తో సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు షూట్‌ఆఫ్ నిర్వహించారు. ఈ సమయంలో చికిత, సాహిల్ ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా బుల్స్‌ఐని కొట్టడంతో భారత్ ఖాతాలోకి మరో పసిడి వచ్చి చేరింది.

సహ పైలట్‌తో పోరాడి.. 180 మంది ప్రాణాలు కాపాడిన భారతీయ పైలట్

సహ పైలట్ దాడి చేసినా.. ప్రాణాలకు తెగించి మరీ ఆయన 180 మంది ప్రయాణికులను కాపాడారు. ఓవైపు దాడిని ఎదుర్కొంటూనే.. మరోవైపు విమానం కూలిపోకుండా నియంత్రించారు. అనంతరం షైదుబాయ్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు ఆఫ్-డ్యూటీ పైలట్లు విమానాన్ని సురక్షితంగా సౌదీ అరేబియాలో ల్యాండ్ చేశారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్‌కు చెందిన వార్త సంస్థలు వెల్లడించాయి. దాడిలో భారతీయ కెప్టెన్‌కు గాయాలయ్యాయి. కాగా ఒమన్‌కు చెందిన పైలట్ ఈ విమానాన్ని కూల్చడానికి ప్రయత్నించాడని సమాచారం. దీనికి అడ్డుగా ఉన్న భారతీయ పైలట్‌పై కత్తితో దాడి చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భారతీయ పైలట్ అతడితో పోరాడి.. ప్రయాణికులను రక్షించారు. ప్రస్తుతం ఇద్దరు పైలట్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పునరుత్పాదక ఇంధన రంగానికి ఊతం.. రూ.1,86,405 కోట్ల నిధులు

'పవర్ ఎవాక్యుయేషన్' అంటారు. ఇందుకోసం భారీ విద్యుత్ లైన్లు, గ్రిడ్‌లు, బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌ను దేశవ్యాప్తంగా నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ భారీ మొత్తాన్ని ఖర్చు చేస్తుంది. వ్యవసాయం, పట్టణ రవాణా రంగాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కేంద్ర మంత్రి మండలి రూ.2,79,157 కోట్ల (సుమారు రూ.2.79 లక్షల కోట్లు) విలువైన మూడు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు.

రబీ పంటలకు సవరించిన మద్దతు ధరలు

రబీ మార్కెటింగ్ సీజన్ 2027-28కి గానూ ఆరు ప్రధాన రబీ పంటలకు కనీస మద్దతు ధరలను పెంచుతూ కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని ద్వారా రైతులకు దాదాపు రూ. 90,962 కోట్ల లబ్ధి చేకూరనుంది.

నీట్ పేపర్ లీక్ ఎఫెక్ట్ - వచ్చే ఏడాది నుంచి ప్రవేశ పరీక్షల్లో మార్పులు - 'సీబీటీ' విధానంపై కేంద్రం కసరత్తు!

కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షలు జరిపేందుకు కేంద్రం కసరత్తు- వచ్చే ఏడాది నుంచి స్టార్ట్ !

నీట్ ప్రవేశ పరీక్షను ఇకపై పెన్ అండ్ పేపర్ విధానంలో కాకుండా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలోకి మార్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. ఈ ఏడాది నీట్ పేపర్ లీక్ అయ్యి, విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ జాతీయ స్థాయిలో ఈ వైద్య విద్య ప్రవేశ పరీక్షలను సీబీటీ విధానంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోందని సంబంధిత అధికారులు తెలిపారు.

ఈ ఏడాది ప్రారంభంలో నీట్ పేపర్ లీక్ జరిగిన తర్వాత, వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను సీబీటీ విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతానికి ఈ ప్రణాళిక పరిశీలనలో ఉందని, నందన్ నిలేకని అధ్యక్షతన ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ నుంచి నివేదిక వచ్చిన తర్వాత తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని సదరు అధికారులు పేర్కొన్నారు. భారతదేశంలోని ప్రభుత్వ పరీక్ష వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి నందన్ నిలేకని అధ్యక్షతన కేంద్రం ఓ టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

ఇకపై పెన్ -పేపర్ విధానానికి స్వస్తి!

ఇప్పటి వరకు నీట్ పరీక్షను పెన్ అండ్ పేపర్ విధానంలో నిర్వహిస్తూ వస్తున్నారు. కానీ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టీఏ) ఇప్పటికే చాలా ప్రవేశ పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ టెస్టింగ్ విధానంలో నిర్వహిస్తోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష జేఈఈ-మెయిన్స్ , సీయూఈటీ- యూజీ, పీజీ, యూజీసీ-నెట్ , సీఎస్ ఐఆర్ యూజీసీ-నెట్ వంటి పరీక్షలను సీబీటీ విధానంలోనే నిర్వహించడం జరుగుతోంది. అందుకే ఈ మౌలిక సదుపాయాల వ్యూహం అమల్లోకి వచ్చిన తర్వాత, అన్ని ప్రవేశ పరీక్షలను ఆన్ లైన్ విధానంలోకి మార్చాలని కేంద్రం ప్రణాళికలు వస్తోందని సంబంధిత అధికారులు తెలిపారు.

ప్రత్యేక వ్యూహం

దేశంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష కేంద్రాల లభ్యత ఒకేలా లేదు. అందుకే ప్రాంతాల వారీగా ఉన్న వ్యత్యాసాలను తొలగించి, అన్ని సెంటర్లలో పరీక్ష ప్రమాణాలు ఒకేలా ఉంచడానికి ఒక ప్రత్యేక వ్యూహాన్ని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి తెలిపారు. అయితే ఈ మార్పు వల్ల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, మహిళలు, ఇంటర్నెట్ సరిగ్గా లేని ప్రాంతాల అభ్యర్థులపై ఎలాంటి ప్రభావం పడుతుంది? అక్కడ సమకూర్చాల్సిన మౌలిక సదుపాయాలు ఏమిటి? అనే కోణంలో కసరత్తు జరుగుతోంది. దీనిపై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)లతో సంప్రదింపులు జరుపుతున్నామని, వాటి ఆమోదంతో ముందుకెళ్తామని సదరు అధికారులు తెలిపారు. ఎందుకు ఇదంతా? ఈ ఏడాది నీట్ -యూజీ పేపర్ లీక్ కావడం వల్ల దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర నిరసనలు వ్యక్తం చేశారు. ఈ వివాదం ఎంతటి తీవ్ర రూపాన్ని దాల్చిందంటే, కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవి నుంచి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవాల్సి వచ్చింది. ఆ మరుసటి రోజు ప్రధాని మోదీ స్పందిస్తూ, ఇకపై పరీక్షల లీకేజీ జరగకుండా ఉండేందుకు, నందన్ నిలేకని అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఈ కమిటీ ఇంకా తన తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. వాస్తవానికి నీట్ పరీక్షను ఆన్ లైన్ లో సీబీటీ విధానంలోకి మార్చాలని ముందు నుంచే ప్రతిపాదనలు ఉన్నాయి.

మంచిపేరొచ్చినా.. చెడ్డ పేరొచ్చినా ఉద్యోగుల వల్లే: సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు సాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరినీ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులుగా భావించి సేవలు అందించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 10.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 4 కోట్ల మంది ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. కేవలం 3 శాతం మంది ఉద్యోగులు 97 శాతం ప్రజలకు సేవ చేయడం శ్రమతో కూడుకున్న పనైనప్పటికీ, ఎంతో బాధ్యతగా పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.



ఎన్నికల సమయం వచ్చినప్పుడే రాజకీయాలు..

ప్రభుత్వానికి మంచి పేరొచ్చినా, చెడ్డ పేరొచ్చినా అది పూర్తిగా ఉద్యోగుల పనితీరు వల్లే ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పట్ల ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం సరిగా పనిచేయడం లేదనే భావన ప్రజల్లోకి వెళ్తుందని హెచ్చరించారు. అందరి సహకారంతోనే రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్నామని, ఇంకా అనేక సమస్యలు ఉన్నందున వాటిని ప్రజలకు నిత్యం సేవలందిస్తూనే పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇక అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.810 కోట్ల నిధులను విజయవంతంగా సాధించుకున్నామని సీఎం వెల్లడించారు. కేంద్రం రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తే దాన్ని బహిరంగంగా అభినందించడానికి తమకు ఎలాంటి శషభిషలు లేవని స్పష్టం చేశారు. ఎన్నికల సమయం వచ్చినప్పుడే రాజకీయాలు, ప్రత్యర్థులు ఉంటామని... మిగతా సమయాల్లో రాష్ట్రం, కేంద్రం కలిసికట్టుగా రాష్ట్రాభివృద్ధి కోసం పరస్పరం సహకరించుకునే ఆరోగ్యకరమైన ధోరణి ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

అక్టోబర్2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' యాత్ర- ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసిన ఇండీ కూటమి

మొదటి పేజీ తరువాయి

ఈ ఓట్ల దొంగతనం వెనుక ఉండి ఎన్నికల సంఘాన్ని పావుగా వాడుకుంటున్నారని ఖర్గే ఆరోపించారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ జుఎవీలకు స్వస్తి పలికి బ్యాలెట్ పేపర్లను వాడాలని డిమాండ్ చేశారు. అలాగే .కు ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సంస్థలను బలహీనపరుస్తున్నారని, ఎన్నికల సంఘం ప్రభుత్వ ప్రభావానికి లోనవుతోందని ఖర్గే ఆరోపించారు. అక్రమ మార్గాల ద్వారా ఎన్నికల్లో గెలుస్తున్నారని, ప్రతిపక్ష పార్టీల ప్రజాస్వామ్య పనితీరుకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. "అక్టోబర్ 2 నుంచి 8 వరకు ఇండియా బ్లాక్ కార్యకర్తలు జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతారు. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం వద్దకు పాదయాత్ర చేస్తారు. ప్రతిపక్ష నాయకులు భారత రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరనున్నారు. అక్టోబర్ రెండోవారంలో మేము వారికి ఒక వినతిపత్రాన్ని సమర్పించనున్నాం. ప్రభుత్వం సృష్టిస్తున్న రాజ్యాంగపరమైన అడ్డంకులను, మాకున్న ఇబ్బందులను రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్తాం. ప్రజలను ఇబ్బంది పెడుతూ వ్యవస్థలను నాశనం చేస్తూ వారి సొంత నిర్ణయాలతో నేడు ఈ దొంగల ప్రభుత్వాన్ని నడుపుతున్నారని రాష్ట్రపతికి తెలియజేయాలనుకుంటున్నాం. ఈ విషయంలో మేం ఎంతవరకు విజయం సాధిస్తామనేది తర్వాత చూస్తాం. అక్టోబర్- నవంబర్ నెలల్లో ఐదు ప్రధాన ర్యాలీలు నిర్వహిస్తాం. ఇందుకు సంబంధించిన వేదికలు, తేదీలు త్వరలో ఖరారు చేస్తాం. నవంబర్ 1న దిల్లీలో ఒక ప్రధాన ర్యాలీని నిర్వహిస్తాం."

మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

ఈ కీలక సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే హాజరయ్యారు. శివసేన-యూబీటీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ తదితరులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఇండియా కూటమి నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య నిర్మాణంపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌లు దాడి చేశారని అన్ని పార్టీలు భావిస్తున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి శిక్షపడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు. మరోవైపు ఈ పరిణామాలను అత్యంత కుంభకోణంతో కూడుకున్న విషయంగా మమతా బెనర్జీ అభివర్ణించారు. జజుజ జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన్ను తొలగించకపోతే ఆందోళనలు ప్రతి మూలకూ విస్తరిస్తామని దీదీ హెచ్చరించారు. ప్రధాని మోదీ సైతం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. "ప్రజల ఓట్లను దోచుకుని, మోసం చేస్తే ఇక ఈ దేశం ఎక్కడికి పోతుంది? ఇది మా విన్నపం కాదు, మా డిమాండ్. జ్ఞానేష్ కుమార్‌ను తొలగించకపోతే, ఈ ఆందోళన తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంది. ఓట్లను దోచుకున్నారు కదా? అసలు ఈవీఎం యంత్రాన్ని ఎందుకు ఉపయోగించారు? ఆ శివ ఖన్నా ఎవరు? అతను



సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అతనికి ఆ సాఫ్ట్‌వేర్ ఎక్కడి నుంచి వచ్చింది? ఒక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసి దాని ద్వారా పూర్తిగా దోచుకున్నారు. వారు ఆ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఈఆర్ఓలను పూర్తిగా స్తంభింపజేశారు. మొత్తం వ్యవస్థను ప్రమాదంలో పడేశారు. సీఈసీ ఆ పదవిలో ఒక్క నిమిషం కూడా కొనసాగే అర్హత లేదు. తక్షణమే రాజీనామా చేయాలి. ఆయనతో పాటు ప్రధాని మోదీ కూడా రాజీనామా చేయాలి."

మమతాబెనర్జీ, టీఎంసీ అధినేత్రి

మరోవైపు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ ఆయనను వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మండిపడ్డారు. దేశంలో జీవితకాల సంపూర్ణ చట్టపరమైన రక్షణను అనుభవిస్తున్న ఏకైక పౌరుడు జ్ఞానేష్ కుమార్ అని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ...

మొదటి పేజీ తరువాయి

పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు



లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

పేదల సంతోషమే నిజమైన అభివృద్ధి.. 60 వేల మందికి పట్టాలు ఇచ్చాం

మొదటి పేజీ తరువాయి

మార్కెట్ విలువ రూ.52 వేల కోట్లని వెల్లడించారు.

అందుకే పేదలకు పట్టాభిషేకమని పేరు పెట్టాం..

130 చ.గ లు యావరేజ్‌ను ఇచ్చామని, సరాసరి కోటి నుంచి రెండు కోట్ల ఆస్తిని అప్పగించామని సీఎం తెలిపారు. అందుకే పేదలకు పట్టాభిషేకమని పేరు పెట్టినట్లు పేర్కొన్నారు. యాభై, అరవై ఏళ్ల కలను సాకారం చేశామన్నారు. నిన్నటి వరకు ఆస్తి ఉన్నప్పటికీ దానిని ఉపయోగించే పరిస్థితి లేదని.. ఇప్పుడు పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పేదల సంతోషమే నిజమైన అభివృద్ధి అని చెప్పుకొచ్చారు. 'ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వారికి పట్టాలు ఇచ్చాం.. ఇందుకు కృషి చేసిన మీ ఎమ్మెల్యేలు, అధికారులకు మీరు కృతజ్ఞత చెప్పాలి. ఎన్నికలలో మేము సుపరిపాలన అందిస్తామని చెప్పాం. మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చాం' అని అన్నారు.

అమ్ముకోవద్దు.. కాపాడుకోండి

ఐదేళ్ల విధ్వంసకర పాలన నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించామని ముఖ్యమంత్రి అన్నారు. కూడు, గూడు, గుడ్డ పేదలకు ఇవ్వాలని అన్న ఎన్టీఆర్ మొదలు పెట్టారని.. అదే విధానాన్ని తాము అమలు చేసి పేదల గుండెలో ఆనందాన్ని నింపామని చెప్పారు. అబ్జక్షన్ లేని భూములను పేదలకు ఇవ్వాలని నిర్ణయించి అమలు చేశామన్నారు. 'ఇది వారసత్వ హక్కు.. మీరు అమ్ముకోవద్దు.. కాపాడుకోండి' అని సూచించారు. పేదలు శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకుని ఆనందంగా జీవించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సేవలను సులభతరం చేశామని చెప్పారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఇటువంటి ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

రాజముద్రతో మీ ఆస్తులు మీకిచ్చాం..

2019-24 మధ్య ప్రభుత్వమే భూవివాదాలను ప్రోత్సహించిందని చంద్రబాబు విమర్శించారు. ప్రజల ఆస్తులపై వారి ఫొటోలు పెట్టుకున్నారని వైసీపీపై మండిపడ్డారు. 'కూటమి ప్రభుత్వంలో నా ఫొటో లేదు, నా మిత్రుడు పవన్ కల్యాణ్ ఫొటో లేదు. కేవలం ప్రభుత్వం రాజముద్రతో మీ ఆస్తులు మీకు ఇచ్చాం' అని వెల్లడించారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ ద్వారా ఆస్తులు కొల్లగొట్టాలని చూశారని ఆరోపించారు. కీలుబొమ్మల్లాగా ప్రజలను ఆడించాలని చూస్తే ప్రజలు వారికి బుద్ధి చెప్పారన్నారు. తాము ఆ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశామని.. పేదల ఆస్తులకు భద్రత, భరోసా కల్పించామని చెప్పారు. రూపాయి కూడా లేకుండా ఉచిత రిజిస్ట్రేషన్ చేయించామని తెలిపారు.

వేగంగా అభివృద్ధి పనులు..

రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతం చేశామని సీఎం తెలిపారు. అన్ని రహదారుల నిర్మాణం చేశామని, ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని అన్నారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్రకు నీరు ఇచ్చామని.. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా చేస్తున్నామని చెప్పారు. వైసీపీ గొడ్డలి పార్టీ పట్టిసీమకు అడ్డుపడితే... తాము కట్టి చూపామన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్దకు 490 టీఎంసీల నీరు గోదావరి నుంచి మళ్లించామన్నారు. ఈ ఏడాది వర్షాలు లేవని.. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు సాగు, తాగు నీరు ఇచ్చామని తెలిపారు. 14 వందల టీఎంసీల గోదావరి నీరు సముద్రంలోకి వెళుతున్నాయని, వంద టీఎంసీల నీరు తెస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని అన్నారు.

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



'మీకు హామీ ఇస్తున్నా.. పోలవరం పూర్తి చేస్తాం... నీటిని కృష్ణా డెల్టా, రాయలసీమకు మళ్లిస్తాం. కొంతమంది స్వార్థపరులు వారు బాగుంటే చాలు అనుకుంటారు. మేము అందరూ బాగుండాలని, ఆనందంగా ఉండాలని కోరుకుంటాం. గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణ రాష్ట్రాలకు నీటి కొరత ఉండదు. భవిష్యత్తులో 36 ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. కృష్ణా పుష్కరాల సమయానికి గోదావరి, కృష్ణా నీరు పుష్కలంగా మనకి వస్తాయి. అభివృద్ధి, సంక్షేమం ఈ ప్రభుత్వానికి రెండు కళ్లు. పేదలకు ఆదాయ మార్గాలు చూపి జీవన ప్రమాణాలు పెంచాలి. రేపు ఉదయం ఆరు గంటలకే గుడ్ మార్నింగ్ చెప్పి పెన్షన్ అందిస్తాం. ఉద్యోగులకు ఆలస్యం అయినా.. పెన్షన్‌దారులకు ఆలస్యం చేయకుండా అందిస్తున్నాం. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగింది. భవిష్యత్తులో ఏసీ బస్సులే కొంటాం.. పేదలు అందులోనే ప్రయాణం చేయాలి' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

క్వాంటమ్ నుంచి ఉద్యోగాల వరకు.. ఏపీ భవిష్యత్‌పై లోకేశ్ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

యువతకు ఉద్యోగాలే తొలి లక్ష్యం

యువత తమను అడుగుతున్నది ఒ

విజయనగరంలో రూ. 44 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విజయనగరం, సెప్టెంబర్ 30 (దరువు ప్రతినిధి): విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో విశాఖపట్నం ప్రాంతీయ పట్టణాభివృద్ధి సంస్థ నిధుల ద్వారా మంజూరైన 44 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన జరిగింది. నగరంలోని 50వ డివిజన్ పరిధిలోని వైఎస్ఆర్ నగర్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, స్థానిక శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ముఖ్య అతిథులుగా హాజరై ఈ అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొట్టి



అధికారికంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. మంజూరైన నిధులతో రహదారులు, డ్రెయిన్లు తదితర అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

12వ పిఆర్సి కమిషన్ ను వెంటనే ఏర్పాటు చేయాలి

సిఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున

రాయదుర్గం,సెప్టెంబర్ 30,దరువు న్యూస్:రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 12వ పి.ఆర్.సి కమిషన్ ను ఏర్పాటు చేసి మున్సిపల్ కార్మికులకు వేతనాలను పెంచాలని సిఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు.బుధవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాయదుర్గం పట్టణంలో మున్సిపల్ కార్మికులతో కలిసి అరగంట పాటు స్థానిక వినాయక సర్కిల్ నందు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ,మున్సిపల్ కార్మికులు అందరిని పర్మినెంట్ చేయాలని,మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగాన్ని తక్షణమే కల్పించాలని,రిటైర్మెంట్ సర్వీసు 62 సంవత్సరాలు



పెంచాలని,రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని,పెన్షన్ సౌకర్యం కల్పించాలని,పర్మినెంట్ మున్సిపల్ కార్మికులందరికీ పెండింగ్లో ఉన్న సరెండర్ లీవ్లను మంజూరు చేయాలని,హైకోర్టు తీర్పు ప్రకారం శాశ్వత స్వభావం కలిగిన పనులలో పర్మినెంట్ కార్మికుల్ని నియమించాలని, మున్సిపల్ కార్మికులకు పిఆర్సిని వర్తింపజేయాలని,డి ఏ మరియు మధ్యంతర భ్రూతి చెల్లించాలని డిమాండ్ చేశారు.పై సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంపై సిఐటీయు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఇంజనీర్ కార్మికులు నరసింహులు, తిప్పేరుద్ర, సూరి, రమేష్, గోపాల్, రాము,ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ వర్కర్ల ఆరోగ్యం కాపాడడం మనందరి బాధ్యత

శ్రీ సత్య సాయి జిల్లా డీపీఓ సమత

నల్లమాడ, సెప్టెంబర్30,దరువు న్యూస్:స్వచ్ఛత హి సేవ -2026 కార్యక్రమం లో భాగంగా బుధవారం నల్లమాడ మండలంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో రెడ్డిపల్లి పి హెచ్ సి డాక్టర్ల బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిపిఓ సమత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈసందర్భంగా సమత మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండడంలో క్లాప్ మిత్రాల పాత్ర అమోఘమైనదని వాళ్లు సమాజానికి చేసే సేవ వెలకట్టలేనిదని అందుకనే వారి యొక్క ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వం గుర్తించి ఈరోజు కేవలం వారి యొక్క ఆరోగ్యం శ్రేయస్సు వివిధ రకాల సంక్షేమ పథకాలు పైన పూర్తిగా ఈ కార్యక్రమం ప్రభుత్వం నిర్వహించడం జరుగుతున్నది.క్లాప్ మిత్రాలు కూడా ఈ చెత్త సేకరణ చేసే సమయంలో చేతులకు కచ్చితంగా గ్లవ్స్ వేసుకోవాలని మాస్కు ధరించాలని ఇంకా తగు జాగ్రత్తలు తీసుకొని వారి యొక్క ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారు సూచించారు.వైద్య సిబ్బందితో మాట్లాడుతూ క్లాప్ మిత్రులకు బిపి,షుగర్ ఇవే కాకుండా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నటువంటి అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే తగిన మందులు ఇచ్చి లేదా అవసరమైతే పై ఆసుపత్రులకు రిఫరల్ చేసి వారి యొక్క ఆరోగ్య విషయంలో సహాయపడాలని వారిని కోరారు.ఈ కార్యక్రమంలో క్లాప్ మిత్రాలు తమ సమస్యలను డిపిఓ కి విన్నవించుకోగా వారు సానుకూలంగా స్పందించి పంచాయతీ సిబ్బందికి



తగినటువంటి ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అంతేకాకుండా వారి యొక్క కుటుంబ సంక్షేమం కోసం భీమా సౌకర్యం కల్పించాలని అందులో భాగంగా ప్రభుత్వం నుండి 500 రూపాయలు వారికి ప్రీమియం చెల్లించబడుతుందని వారు తెలియజేశారు.నల్లమాడ ఎంపీడీవో అంజనప్ప మాట్లాడుతూ క్లాప్ మిత్రాలు వారి యొక్క ఆరోగ్యం జీతభత్యాలు వంటి విషయాల పైన మేడమ్ తీసుకునే చొరవ అభినందనీయమని ఈ విషయంలో నల్లమాడ మండలం తరపున వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.క్లాప్ మిత్రాలు ఆరోగ్యం మరియు పోషకాహార విషయాలలో అవగాహన కలిగి తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన హాస్పిటల్ డైరెక్టర్ నాగభూషణం నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్క క్లాప్ మిత్రలు కూడా విధిగా నీరు ఎక్కువగా తీసుకోవాలని పోషకాహార విలువలు ఉన్నటువంటి ఆహారాన్ని తీసుకోవాలని తద్వారా తమ యొక్క ఆరోగ్యాన్ని



కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు కూడా శ్రద్ధ వహించాలని తెలియజేశారు.అనంతరం శానిటేషన్ వర్కర్లు పంచాయతీ హెల్త్ సిబ్బంది తో టగ్ ఆఫ్ వార్,మ్యూజికల్ చైర్ లాంటి ఆటలను నిర్వహించడంతో శానిటేషన్ వర్కర్లు, వైద్య మరియు పంచాయతీ సిబ్బంది అందరూ కూడా చాలా ఉత్సాహంగా ఆనందంగా ఆహ్లాదకరంగా పాల్గొన్నారు.ఈ ఆటల్లో గెలుపొందిన వారికి ప్రథమ ద్వితీయ మరియు తృతీయ బహుమతులు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి సత్యసాయి జిల్లా డిపిఓ సమతా,సిడిపిఓ, ఎంపీడీవో అంజనప్ప,సిహెచ్ఓ, డాక్టర్ దీప్తి,డిప్యూటీ ఎంపీడీవో మునాఫ్,ఏ పి ఎం గోపాల్,అగ్రికల్చర్ ఏ ఓ,స్వచ్ఛ భారత్ ఎం ఆర్ సి గంగాధర్, పంచాయతీ డెవలప్మెంట్ అధికారులు, జడ్పీహెచ్ఎస్ స్కూల్ పీడీ మధు,వివిధ గ్రామాల నుంచి క్లాప్ మిత్రాలు,వైద్య మరియు ఆరోగ్య సిబ్బంది,హాస్పిటల్ డైరెక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు,పంచాయితీ సిబ్బంది అలంక నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లి హార్టికల్చర్ హబ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి,సెప్టెంబర్ 30, దరువు న్యూస్:ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు అక్టోబర్ 2న మదనపల్లిలో నిర్వహించనున్న హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు.ములకలచెరువులోని కేజీయన్ ఫంక్షన్ హాల్లో తంబళ్లపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు,కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గంలో పార్టీ కోసం నాయకులు,కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని, పార్టీ బలోపేతానికి వారి కృషి అభినందనీయమని



అన్నారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే పార్టీ కార్యక్రమాలను మరింత విజయవంతంగా నిర్వహించవచ్చన్నారు.కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని,ప్రతి కార్యకర్తను గౌరవిస్తూ,అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాలని సూచించారు.ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు తంబళ్లపల్లి



నియోజకవర్గం నుంచి నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ సమావేశంలో రోడ్లు--భవనాల శాఖ మంత్రి,అన్నమయ్య జిల్లా ఇంచార్జి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి,జోన్--4 ఇంచార్జి శ్రీ దామచర్ల సత్య,అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల దీక్షకు సిపిఐ సంపూర్ణ మద్దతు

కదిరి,సెప్టెంబర్ 30,దరువు న్యూస్:శ్రీ సత్యసాయి జిల్లా,కదిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గత కొద్ది రోజులుగా వీఆర్ఏల ఆధ్వర్యంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలకు,రెవెన్యూ శాఖకు కీలకంగా సేవలందిస్తున్న వీఆర్ఏలు,ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.వీఆర్ఏలు, ప్రధానంగా కోరుతున్న జీతం స్కేలు అమలు,అర్హత ఉన్న వారికి పదోన్నతులు (ప్రమోషన్లు),ఉద్యోగ భద్రత,సర్వీస్కు సంబంధించిన సమస్యల పరిష్కారం,జాయింట్ యాక్షన్ కమిటీతో ప్రభుత్వం చర్చలు జరపడం,ఉద్యోగుల కుటుంబాలకు రక్షణ కల్పించడం వంటి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు.ఎన్నో సంవత్సరాలుగా తక్కువ



వేతనాలతో గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరికాదని అన్నారు.వీఆర్ఏల సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి,సాధ్యమైన డిమాండ్లను కాలపరిమితితో పరిష్కరించాలని డిమాండ్ చేశారు.వీఆర్ఏలు చేపడుతున్న ఈ దీక్షకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తరఫున సంపూర్ణ సంఘీభావం,మద్దతు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు వారి పోరాటానికి అండగా ఉంటామని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఆదినారాయణ,ప్రజానాట్యమండలి భాస్కర్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తిప్పన్న అంజినప్ప పాల్గొన్నారు.

పోరుమామిళ్ల ప్రధాన రోడ్డులో డివైడర్ పనులపై అయోమయం,ప్రజల భద్రతపై ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఆందోళన

పోరుమామిళ్ల,సెప్టెంబర్ 30, దరువు న్యూస్:పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ పరిధిలోని ప్రధాన రోడ్డులో జరుగుతున్న రోడ్డు,డివైడర్ పనులపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బస్టాండ్ సమీపం నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు డివైడర్ పనులు మధ్యలోనే నిలిచిపోవడం పై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.ఈ మార్గానికి ఇరువైపులా పాఠశాలలు, కళాశాలలు ఉండటంతో విద్యార్థులు,ప్రజల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని డివైడర్ అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. డివైడర్ మధ్యభాగంలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని స్థానికులు చెబుతున్నారు.అలాగే సాయిబాబా ఆలయం సమీపంలో డివైడర్కు తగిన క్రింది భాగం సపోర్ట్ లేకుండా నిర్మించారు.చిన్నపాటి వాహనం ఢీకొన్నా డివైడర్ కిందపడే ప్రమాదం ఉంది.అధికారులు నాణ్యతను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని.రాజధాని వైపు వెళ్లే ప్రధాన రహదారిగా ఉన్న ఈ మార్గంలో అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేపట్టాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యులు గంగన్న,ఫణి రావు, ప్రవీణ్,సాగర్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి,పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రజలకు సురక్షితమైన,సౌకర్యవంతమైన రహదారి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచండి

రాయదుర్గం,సెప్టెంబర్ 30,దరువు న్యూస్:అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు,ఉద్యోగులు,వ్యాపారులు మరియు సామాన్య ప్రజలు ఆర్టీసీ బస్సు సర్వీసులు సకాలంలో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా కోవిడ్ తర్వాత రద్దయిన కొన్ని గ్రామీణ సర్వీసులు ఇప్పటికీ పునరుద్ధరించబడలేదు.ప్రజల రవాణా సౌకర్యార్థం ఈ క్రింది డిమాండ్లను పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామీణ సర్వీసుల పునరుద్ధరణ జిల్లాలోని మారుమూల గ్రామాలకు గతంలో నడిచిన ఆర్టీసీ బస్సులను వెంటనే పునరుద్ధరించాలి. విద్యార్థుల వేళలకు అనుగుణంగా బస్సులు స్కూళ్లు,కాలేజీల సమయాల్లో ఉదయం మరియు సాయంత్రం అదనపు ట్రిప్పులు నడపాలి.బస్సుల కొరత వల్ల విద్యార్థుల ప్రాణాలకు తెగించి పుట్బోర్డ్ ప్రయాణం చేస్తున్నారు.రద్దీ మార్గాలలో అదనపు బస్సులు ఇక్కడ మీ ప్రాంతంలో బస్సులు అవసరమైన ముఖ్యమైన రూట్ల రాయదుర్గం నుండి శ్రీశైలం అనంతపురం నుండి కళ్యాణదుర్గం,తాడిపత్రి మొదలగు మార్గాల్లో రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను పెందాలి.నైట్ హాల్ట్ (రాత్రి బస) బస్సులు గ్రామాల్లో రాత్రి వేళల్లో నిలిచే బస్సు సర్వీసులను పెంచడం ద్వారా ఉదయాన్నే నగరాలకు వచ్చే రైతులకు,వ్యాపారులకు లబ్ధి చేకూరుతుంది.బస్టాండ్లలో కనీస సౌకర్యాలు జిల్లాలోని ప్రధాన బస్టాండ్లతో పాటు మండల కేంద్రాల్లోని బస్ స్టాండ్లలో తాగునీరు,మరుగుదొడ్లు,మరియు లైటింగ్ సౌకర్యాలను మెరుగుపరచాలి.కనుక,ప్రజల రవాణా అవసరాలను గుర్తించి,సానుకూలంగా స్పందించి ఈ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించగలరని ఆమ్ ఆద్మీ పార్టీ తరపున ఆశిస్తున్నాము.బుధవారం అనంతపురం ఆర్ఎం ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందనీ తెలియజేశారు.

చిన్నపాటి వర్షానికే చిన్న వంకను తలపిస్తున్న చైతన్య కాలని

నార్పల మండల కేంద్రంలోని చైతన్య కాలని వైపు చూడని ప్రభుత్వ అధికారులు



శింగనమల,సెప్టెంబర్ 30,దరువు న్యూస్:శింగనమల నియోజకవర్గం లోని నార్పల మండల కేంద్రంలోని చైతన్య కాలనీలో కనీస మౌలిక సదుపాయాల లేని కారణంగా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం కురిసిన వర్షంతో కాలనీలోని అంతర్గత వీధులు చెరువులను తలపించేలా మారాయి.సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపైనే నిలిచిపోయి రాకపోకలకు ఆటంకం కలిగిస్తోంది. వర్షం పడిన ప్రతిసారీ ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని,ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదని చైతన్య కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల నిర్వహణ



కొత్తచెరువు,సెప్టెంబర్ 30, దరువు న్యూస్: కొత్తచెరువు మండల కేంద్రంలోని, నెహ్రూ నగర్ అంగన్వాడి సెంటర్లో పోషణ మాసోత్సవాలను అంగన్వాడీ కార్యకర్తలు బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ లబ్ధిదారులకు మంచి ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు తీసుకోమన్నారు. మనం తినే ఆహారంలో పోషణతో కూడిన ఆహారం తినాలని,మన పిల్లలకు పోషణతో కూడిన ఆహారం పెట్టాలని అంగన్వాడీ సూపర్వైజర్ సుజాత తెలియజేసారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ నాగవేణికి అలాగే హెల్పర్ గంగమ్మకు శాలువా మరియు పూలమాలవేసి అంగన్వాడీ సూపర్వైజర్ సుజాత సత్కరించారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ కార్యకర్త నాగవేణి,హెల్పర్ గంగమ్మ,లబ్ధిదారులు పాల్గొనడం జరిగింది.

స్వచ్ఛతహై సేవా సంకల్ప అభియాన్ పై అవగాహన కల్పించిన ప్రభుత్వ హెల్త్ సిబ్బంది



ముదిగుబ్బ,సెప్టెంబర్ 30,దరువు న్యూస్:ముదిగుబ్బ మండల పరిధిలోని మలక వేముల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎనుముల వారి పల్లిలో సేవ సంకల్ప అభియాన్ కార్యక్రమం,స్వచ్ఛతహై సేవ అవగాహన కార్యక్రమాలు ప్రభుత్వ హెల్త్ సిబ్బంది,గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు బుధవారం నిర్వహించడం జరిగినది.ఎనుముల వారి పల్లి గ్రామ ప్రజలకు మలక వేమల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెల్త్ సిబ్బంది జ్వరము,దగ్గు షుగరు,బిపి వివిధ రకమైనటువంటి రోగులకు హెల్త్ సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు.అదేవిధంగా స్వచ్ఛభారత తహై సేవా అవగాహన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవితమ్మ గ్రామ ప్రజలకు తడి చెత్త పొడి చెత్త బజారులు ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా స్వచ్ఛభారత కార్మికుల బండిలోనే వేయవలెనని ఇంటి చుట్టూ పరిసర పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ ప్రజలకు పంచాయతీ కార్యదర్శి సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కృష్ణవేణి,ఎం ఎల్ హెచ్ పి భార్గవి,మెయిన్ హెల్త్ అసిస్టెంట్ ఎం హరినాథ్ రెడ్డి,ఆశ వర్కర్లు,గ్రీన్ అంబాసిడర్ లు స్వచ్ఛభారత్ కార్మికులు,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీల చైర్మన్లు, సభ్యులతో మంత్రి భేటీ



ఉరవకొండ, సెప్టెంబర్ 30, దరువు న్యూస్ :

ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ పాఠశాల కమిటీల చైర్మన్లు, సభ్యులు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తో భేటీ అయ్యారు. బుధవారం ఉరవకొండలో ఉన్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభవ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీల చైర్మన్లు,సభ్యులకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో పిల్లలను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే దిశగా, పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు పట్టుదలతో పనిచేయాలని మంత్రి వారికి సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కరానికి ప్రత్యేక చర్యలు

- నగరపంచాయతీ కమిషనర్ మురళీధర్



మడకశిర, సెప్టెంబర్ 30, దరువు న్యూస్ :

మడకశిర నగరపంచాయతీలో తాగునీటి సమస్యలు పరిష్కరానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు మడకశిర నగరపంచాయతీ కమిషనర్ మురళిధర్ తెలిపారు. బుధవారం అయన మాట్లాడుతూ.. తాగునీటి శాశ్వత పరిష్కరానికి శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా మడకశిర పట్టణానికి తాగునీటి సరఫరాకు కొత్తగా పైపు లైన్ పనులు చేపట్టినట్లు అయన తెలిపారు. తద్వారా పట్టణంలో ప్రజలకు తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. అదేవిదంగా స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పట్టణంతోపాటు గ్రామాలలో పరిసర ప్రాంతాలలో పరిశుభ్రత పారిశుధ్య పనులను ముమ్మరం చేయడం జరిగిందన్నారు. వీధిదీపాలు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నగరపంచాయతీ అభివృద్ధికి ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ వంతు బాధ్యతగా నగరపంచాయతీ అధికారులకు, సిబ్బందికి సహకరించాల్సిందిగా కమిషనర్ మురళిధర్ కోరారు.

సూక్ష్మ, చిన్న పరిశ్రమల విజయానికి ఐదు అంశాలు కీలకం

జిల్లాలో సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు అవకాశాలు మెండు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సంపూర్ణ సహకారం అందిస్తాం

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

జిల్లా కలెక్టర్ ఎం.శ్యామ్ ప్రసాద్





హిందూపురం, సెప్టెంబర్ 30, దరువు న్యూస్ :

చిన్న, మధ్యతరహా పరిశ్రమల విజయానికి సరైన ఉత్పత్తి ఎంపిక, ఆధునిక సాంకేతికత, ప్రాజెక్టు ఫైనాన్సింగ్, డిజిటైజేషన్, ఈ-కామర్స్-డిజిటల్ మార్కెటింగ్ అనే అంశాలు కీలకమని జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక పట్టణం చౌడేశ్వరి కాలనీలోని సాయితేజ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ, ఎంఎస్ఎంఈ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' ఎంఎస్ఎంఈ గ్రోత్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ డెస్క్, బ్యాంకుల స్టాల్స్, ఉద్యమ రిజిస్ట్రేషన్, ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్లకు ప్రత్యేక డెస్క్‌లను ఏర్పాటు చేశారు. వివిధ ప్రభుత్వ పథకాలు, రుణ సదుపాయాలు, సబ్సిడీలు, పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులపై అధికారులు అవగాహన కల్పించారు. బ్యాంకింగ్ రంగ నిపుణులు రుణాల మంజూరు, ప్రాజెక్టు నివేదికలు, వడ్డీ రేట్లు, రుణాల తిరిగి చెల్లింపు విధానాలపై ఔత్సాహికులకు వివరించారు. వ్యాపారం ప్రారంభించే ముందు స్థానికంగా భవిష్యత్తులో ఏర్పడే పారిశ్రామిక అవకాశాలను అధ్యయనం చేసి సరైన ఉత్పత్తిని ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవచ్చని, నాణ్యతతోపాటు ఒక్కో ఉత్పత్తిపై వచ్చే మార్జిన్‌పై దృష్టి పెట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యాపారం ప్రారంభ దశలో అవసరానికి మించి రుణాలు తీసుకోవద్దని, వడ్డీ రేటుతో పాటు మారటోరియం కాలం, నగదు ప్రవాహాన్ని పరిశీలించి ఫైనాన్సింగ్ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అవసరమైన మేరకే రుణం తీసుకుని, ఆదాయం-ఖర్చులను సమతుల్యంగా నిర్వహించుకోవాలని చెప్పారు. వ్యాపారం విస్తరించినప్పుడు కొనుగోళ్లు, అమ్మకాలు, ఖర్చులు, అకౌంటింగ్, ఉత్పత్తి నిర్వహణ వంటి కార్యకలాపాలను డిజిటల్ వ్యవస్థల ద్వారా పర్యవేక్షించుకోవాలని తెలిపారు. యజమాని ఎక్కడ ఉన్నా తన పరిశ్రమలో జరుగుతున్న కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం మొబైల్ ద్వారా అందేలా డిజిటల్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఈ-కామర్స్, డిజిటల్ మార్కెటింగ్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని కలెక్టర్ తెలిపారు. సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రామ్, ఈ-కామర్స్ వేదికలను వినియోగించుకుని ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌కు చేరువ చేయాలని సూచించారు. ఆన్‌లైన్ విక్రయాల ద్వారా విస్తృత మార్కెట్‌ను అందిపుచ్చుకోవడంతో పాటు వ్యాపార నిర్వహణ వ్యయాలను తగ్గించుకునే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. జిల్లాలో రాబోయే రోజుల్లో ఏర్పడనున్న పరిశ్రమలు, పారిశ్రామిక మౌలిక వసతులను దృష్టిలో పెట్టుకుని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కొత్త అవకాశాలను గుర్తించి ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం రుణాలు, సబ్సిడీలు, ఇతర ప్రోత్సాహకాలు, హ్యాండ్‌హోల్డింగ్ ద్వారా అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఔత్సాహికులు నిపుణులు, సంబంధిత శాఖల అధికారులను సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. డ్వాక్రా, మెప్మా మహిళలు కేవలం రుణాల సేకరణకే పరిమితం కాకుండా, తమలోని ప్రతిభను వెలికితీసి అంతర్జాతీయ స్థాయి వ్యాపారవేత్తలుగా ఎదగాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు. పొదుపు సంఘాల నిర్వహణ, రుణాల చెల్లింపులో శ్రీ సత్యసాయి జిల్లా రాష్ట్రంలోనే టాప్ 5లో నిలవగా, హిందూపురం మహిళలు ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని కొనియాడారు. క్రమశిక్షణతో రుణాలను 100శాతం చెల్లిస్తున్న మహిళల సాధికారత ప్రశంసనీయమన్నారు. స్థానికగా లభించే ముడి సరుకులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఉదాహరణకు జిల్లాలో సమృద్ధిగా లభించే చింతపండును పల్ప్ (గుజ్జు) రూపంలో తయారు చేసి, ఆధునిక యంత్రాలు, ప్యాకింగ్, లీగల్ పర్మిషన్లు, బ్రాండింగ్‌తో మార్కెట్ చేస్తే మంచి డిమాండ్ లభిస్తుందన్నారు. స్వయం ఉపాధి ద్వారా స్వీట్లు, కేకులు, దుస్తుల తయారీ, చోలే మసాలా పొడులు, పిండి మిల్లుల నిర్వహణ వంటి వ్యాపారాలను ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా విక్రయిస్తూ బెంగళూరు వంటి మహానగరాలకు కూడా విస్తరించవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ తరగతులు, సంగీతం నేర్పించడం లేదా తమకున్న నైపుణ్యాలను డిజిటల్ మాధ్యమాల ద్వారా వ్యాపారంగా మలుచుకోవచ్చని వివరించారు. మహిళలందరూ కలిసి సమూహంగా పెద్ద ఎత్తున వ్యాపారాలు చేపట్టాలని, ధైర్యంతో అడుగు ముందుకు వేస్తే వందల కోట్ల టర్నోవర్ సాధించే స్థాయికి ఎదుగుతారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హిందూపూర్ నియోజకవర్గ శాసన సభ్యుల నందమూరి బాలకృష్ణ సమన్వయకర్త వీరయ్య, హిందూపురం మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున, హిందూపురం తహశీల్దార్ వెంకటేశు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జె.నాగరాజు, ఏపీఐఐసీ డీజెడ్ఎం దేవకాంతమ్మ, ఎల్‌డీఎం ఫనీంద్ర కుమార్,

డీఆర్‌డీఏ పీడి నరసయ్య, మెప్మా పీడీ నాగరాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, జెఆర్ సిల్క్స్ అధినేత జింకా రామాంజనేయులు, వేణు మోటార్స్ అధినేత వేణు, గాయత్రి మసాలా పౌడర్స్ పార్టనర్ గౌతమ్ బుశెట్టి, ఇండియా ఎస్ఎంఈ ఫోరం ప్రతినిధులు, బ్యాంకింగ్ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు పాల్గొన్నారు.



మరోసారి నగరంలో అభివృద్ధికి దగ్గుపాటి మార్క్

▶▶ నగరంలో ఒకే రోజు రూ.2.66కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ

▶▶ టవర్ క్లాక్-రైల్వే స్టేషన్ వరకు రూ.1.12కోట్లతో ఫుట్‌పాత్, రోడ్డు పనులు ప్రారంభం

▶▶ అభివృద్ధి విషయంలో రాజీ లేదు.. మాకు వైసీపీతో పోటీనే కాదన్న దగ్గుపాటి

▶▶ పల్లెలతో పాటు పట్టణాల్లోనూ మునుపెన్నడూ లేని విధంగా ప్రగతి : ఎంపీ అంబికా

అనంతపురం, సెప్టెంబర్ 30, దరువు న్యూస్ :

అనంతపురం నగరంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మరోసారి రికార్డ్ స్థాయిలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఒకే రోజు 2కోట్ల 66లక్షల రూపాయల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవితో కలిసి ఈ పనుల్ని ప్రారంభించారు. టవర్ క్లాక్ నుంచి రైల్వే స్టేషన్ వరకు రూ.1.12కోట్లతో ఫుట్‌పాత్, రోడ్డు పనులు, రాజా, రమణ, రమేష్ థియేటర్ వద్ద 60లక్షలతో శంకుస్థాపన చేశారు. మరో 60లక్షలతో మైనార్టీ కమిటీ హాల్ ను ప్రారంభించారు. అలాగే 41వ డివిజన్ లోని తిరుమల నగర్ లో రూ.8.80లక్షలతో సీసీడ్రైన్, కల్వర్టుకు, 48వ డివిజన్ రజకనగర్ బ్రిడ్జి వద్ద రూ.17లక్షలతో సిసి డ్రైన్, సిసి రోడ్డు పనులు, 48వ డివిజన్ శాంతినగర్ 1వ క్రాస్ లో రూ.20లక్షలతో సీసీరోడ్డు, సీసీ డ్రైన్ కు, 48వ డివిజన్ శాంతినగర్ సర్కిల్లో రూ.40లక్షలతో సీసీ రోడ్డు, 45వ డివిజన్ సునీతనగర్ లో రూ.8.40లక్షలతో సీసీరోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు, స్థానిక కూటమి పార్టీల ముఖ్య నాయకులు, మున్సిపల్ అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ కేవలం 26 నెలల స్వల్ప కాలంలోనే అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో రూ.1300 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని వెల్లడించారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తున్నామన్నారు. ఇటీవలే రూ.107.71 కోట్లతో తాగునీరు, వేస్ట్ వాటర్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ను ప్రారంభించామని, రాబోయే ఆరు నెలల్లోనే దీనిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. అలాగే హైబ్రిడ్ యాన్యుటి మోడల్ (నూమీ) పథకం కింద రూ.50 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించామని.. వచ్చే నెలలో మరో రూ.160 కోట్ల భారీ బడ్జెట్‌తో నగరవ్యాప్తంగా అత్యాధునిక డ్రైనేజీల నిర్మాణం చేపట్టబోతున్నామని చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అనంతపురం నగరం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, ఎక్కడా కనీస అభివృద్ధి పనులు జరగలేదని ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు చేశారు. అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, మాకు వైసీపీతో పోలికే లేదన్నారు. మరోవైపు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నాయకత్వంలో అనంతపురం నగరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అద్భుతమైన ప్రగతి పనులు జరుగుతున్నాయని కొనియాడారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి మారుమూల కాలనీని అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, ప్రగతికి కట్టుబడి ఉందనడానికి ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా పల్లె పండుగ 3.0 పేరుతో 16 వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేయడమే నిదర్శనం అని పేర్కొన్నారు.



పిడుగుపాటుకు 25 పొట్టేళ్లు బలి

ధర్మవరం, సెప్టెంబరు 30, దరువు న్యూస్ :

ధర్మవరం మండలం మల్కాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు 25 పొట్టేళ్లు మృతి చెందాయి. ఈ ఘటనలో సుమారు రూ.2.50లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు బిల్లే విజయ్‌కుమార్ తెలిపారు. విజయ్‌కుమార్ తన పొట్టేళ్లను సమీప పొలాల్లో మేపుతూ వర్షం రావడంతో ఓ తోటలోని వేపచెట్టు కింద ఏర్పాటు చేసిన కంచెలోకి తోలాడు. అదే సమయంలో వేపచెట్టుపై పిడుగు పడటంతో విద్యుత్ ఘాతానికి గురై కంచెలో ఉన్న 25 పొట్టేళ్లు అక్కడికక్కడే మృతి చెందాయి. జీవనాధారమైన పొట్టేళ్లు మృతి చెందడంతో విజయ్‌కుమార్ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగింది. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలని బాధితుడు కోరాడు. అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్

అనంతపురం, సెప్టెంబర్ 30, దరువు న్యూస్ :

ఉరవకొండ పట్టణంలో ఉన్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా, ఉరవకొండ నియోజకవర్గంలోని నలుమూల ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన ప్రజలు నాయకుల, సుండి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఫోన్ ద్వారా అధికారులను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు.

మహిళా సాధికారత, చిరువ్యాపారుల అభ్యున్నతికే ప్రాధాన్యత

▶▶ మెప్మా అధికారులతో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి

▶▶ క్యాంప్ కార్యాలయంలో మెప్మా అధికారులతో సమీక్ష

▶▶ బళ్లారి బైపాస్ లో రూ.4.50 కోట్లతో చేపట్టిన స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక చర్చ

అనంతపురం, సెప్టెంబర్ 30, దరువు న్యూస్ :



అనంతపురం నగరంలో చిరువ్యాపారుల జీవనోపాధిని మెరుగుపరచడం, మహిళా సాధికారతను పెంపొందించడమే ధ్యేయంగా పని చేయాలని మెప్మా అధికారులకు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో మెప్మా అధికారులు భవాని, కాటమయ్య, ఇతర అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నగరంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్మార్ట్ స్ట్రీట్, ప్రాజెక్టు పురోగతి, మహిళా సంఘాల ద్వారా నిర్వహించాల్సిన తృప్తి క్యాంటీన్లు, డ్వాక్రా మహిళా పొదుపు సంఘాల ప్రగతిపైనే చర్చించారు. బళ్లారి బైపాస్ లోని అన్నా క్యాంటీన్ వద్ద, ఫ్లైఓవర్ కింద ఉన్న ఖాళీ స్థలంలో రూ.4.50 కోట్ల వ్యయంతో అత్యాధునిక స్మార్ట్ స్ట్రీట్ ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో అపరిశుభ్రంగా ఉన్న ఈ ప్రాంతాన్ని ఆధునీకరించి, చిరువ్యాపారుల కోసం ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల ఎంతోమంది వ్యాపారులకు సురక్షితమైన ఉపాధి లభించడమే కాకుండా ఆ మార్గంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఇక్కడ క్యాంటీన్లు ఏర్పాటు చేసుకునే అంశం మీద మహిళలను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళల ద్వారా తృప్తి క్యాంటీన్లు నిర్వహించేలా చూడాలన్నారు. ప్రజలకు అత్యంత తక్కువ ధరలోనే నాణ్యమైన, పరిశుభ్రమైన మరియు రుచికరమైన భోజనం అందించడమే ఈ క్యాంటీన్ల ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరంలోని మరికొన్ని ప్రధాన రద్దీ కూడళ్లు, బస్ స్టాండ్ల పరిసర ప్రాంతాలలో వీటిని త్వరితగతిన విస్తరించడానికి వీలుగా స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి బ్యాంక్ లింకేజీ రుణాలు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. అర్హులైన ప్రతి మహిళా సంఘానికి ప్రభుత్వ పథకాల ద్వారా గరిష్ట ఆర్థిక తోడ్పాటు అందించాలన్నారు. రుణాలు తీసుకున్న వారు సక్రమంగా చెల్లించే విధంగా చూడాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం, సెప్టెంబర్ 30, దరువు న్యూస్ :

జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సమస్యలు పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధ్యక్షతన జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ ఎస్టీల సమస్యలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా అధికారులు పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించి ఎస్సీలకు ఎక్కడా అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ఎస్సీల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని ఎక్కడ వారు అన్యాయానికి గురి కాకుండా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలన్నారు. పోలీస్, రెవెన్యూ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎస్సీ, ఎస్టీ వర్గాలపై నమోదయిన కేసుల్లో జాప్యాన్ని నివారించి సత్వర న్యాయం అందించాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా పోలీసులతోపాటు సంబంధిత శాఖల అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఎంతోమంది ఎస్సీలకు చెందిన పేదలు వున్నారు వీరికి సంబంధించిన భూ సమస్యలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గాల వారీగా రివ్యూ నిర్వహించి ఎస్సీల భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. చిన్నచిన్న భూ సమస్యలు అధికారులు పరిష్కరించినట్లయితే బాధితులు ఎటువంటి గొడవలకు దిగే అవకాశం ఉండదన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి సంబంధిత అధికారులు



చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా అధికారులు పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని ఎక్కడ వారు అన్యాయానికి గురి కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. జిల్లాలో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి ఎలాంటి పక్షపాతం, జాప్యం లేకుండా విచారణ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించిన ఎలాంటి సమాచారం అయినా తమ దృష్టికి తీసుకురావాలని సభ్యులను కోరారు. పలువురు డివిఎంసి సభ్యులు మాట్లాడుతూ.. జిల్లాలో దప్పు కళాకారులకు ఇచ్చే విధంగా ఉరుముల కళాకారులకు కూడా పెన్షన్ మంజూరు చేయాలన్నారు. నెలలో ఒకరోజు ఎస్సీ, ఎస్టీ పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించాలి. జిల్లాలో కొన్నిచోట్ల ఎస్సీలను దేవాలయాల లోకి ప్రవేశింపచేయలేదు ఈ సమస్య పరిష్కరించాలి. అంబేద్కర్ గురుకుల పాఠశాలలలో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించాలి. గ్రామపంచాయతీలలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు సక్రమంగా నెల నెల జీతాలు ఇవ్వాలి. ఎస్సీ మహిళలు అత్యాచారానికి గురైతే ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి పరిహారం ఇవ్వాలని డివిఎంసి సభ్యులు కలెక్టర్ కు తెలిపారు. ఈ సందర్భంగా గత సమావేశంలో వచ్చిన అంశాలు యాక్షన్ టేకెన్ రిపోర్టుపై కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించి అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, ఎస్సీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ అధికారులు, డివిఎంసి సభ్యులు చిన్నపెద్దన్న, గడ్డం ముత్యాలప్ప, వెంకటేష్, తిరుపాల్, ముసలయ్య, కృష్ణమూర్తి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.